క్లుప్తంగా

నేడు స్పందన

కంచికచర్ల: ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందన స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ఉదయం 10 గంటల నుంచి జరుగుతుందని తహసీల్దార్ శంకరబాబు ఆదివారం తెలిపారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి స్పందనలో అర్జీలు అందజేయవచ్చని వాటిని ప్రాధాన్యతాక్రమంలో పరిష్కరిస్తారని తహసీల్దార్ అన్నారు.

నందిగామ: పట్టణంలోని ఆర్డీవో కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం జరుగుతుందని ఆర్డీఓ రవీంద్రరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

తిరుపతమ్మ సన్నిధిలో భక్తుల సందడి



పెనుగంచిప్రోలు: గ్రామంలోని తిరుపతమ్మ సన్నిధిలో భక్తుల సందడి ఆదివారం అధికంగా ఉంది. సెలవు దినం కావడం, పలు శుభకార్యాలు ఉండటంతో అమ్మవారి దర్శనానికి వివిధ జిల్లాల నుంచి భక్తులు వేలాదిగా తరలి వచ్చారు. భక్తులు అధిక సంఖ్యలో రావడంతో ఆలయ క్యూలైన్లు, పరిసరాలు కిక్కిరిశాయి. వేకువ జామునుంచే భక్తులు పాలు, పొంగళ్లతో అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులు మధ్యాహ్న వేళ మునేరు అవతల మామిడి తోటల్లో సేద తీరారు.

ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాలి



మధురానగర్(విజయవాడసెంట్రల్): వృద్ధులు ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలని, ఉచిత వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని ప్రముఖ ఆయుర్వేద వైద్యనిపుణులు డాక్టర్ ఏవీఎస్కే ప్రసాద్, హోమియో వైద్య నిపుణులు డాక్టర్ కోనా వీర బ్రహ్మం సూచించారు. దుర్గాపురం విజయ్‌నర్సింగ్ స్కూల్లో ఆదివారం వయోవృద్ధ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యాన ఆరోగ్య అవగాహన, ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. 270 మందికి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ ఆదిత్య చంద్రబొట్ల, ట్రస్టీ తట్టి అర్జునరావు పాల్గొన్నారు.

రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన అవసరం



లబ్బీపేట(విజయవాడతూర్పు): రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన అవసరమని రూట్స్ హెల్త్ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ పి.విజయభాస్కర్ అన్నారు. రూట్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం రైల్వే స్టేషన్‌లో ప్రయాణికులు, రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ మహిళా సిబ్బందికి బ్రెస్ట్ క్యాన్సర్‌పై అవగాహన కల్పిస్తూ పింక్ రిబ్బన్ క్యాంపెయిన్ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ విజయభాస్కర్ మాట్లాడుతూ.. రొమ్ము క్యాన్సర్‌ను తొలిదశలో గుర్తిస్తే పూర్తిగా నయం చేయవచ్చునన్నారు. రొమ్ములో గడ్డ, వాపు, కణితి, ఎర్రబడటం వంటి లక్షణాలు ఉంటే మమోగ్రామ్ చేయించుకోవాలని సూచించారు. రొమ్మును సెల్ఫ్ చెక్ చేసుకోవడం ద్వారా లక్షణాలను గుర్తించవచ్చునని తెలిపారు. కార్యక్రమంలో రూట్స్ సభ్యులు సికినం శ్రీనివాస్, వెంకట రమణ, సంజయ్, విజయలక్ష్మి, కామేశ్వరి, సావిత్రి, డాక్టర్ మనోజ్, పున్నారావు, శ్రావ్య పాల్గొన్నారు.

సేవలతో సమాజంలో కీర్తిప్రతిష్టలు



పాయకాపురం(విజయవాడరూరల్): నాయకులు, సభ్యులతో పెంపొందించుకునే ఆత్మీయ బంధమే కలకాలం నిలిచిపోతుందని, మనం చేసే మంచి పనులు, సేవలు, మన్ననలు హృదయాల్లో స్థానం పొందుతాయని వాసవి క్లబ్‌ల మాజీ అంతర్జాతీయ అధ్యక్షుడు వేముల హజరత్తయ్య గుప్తా అన్నారు. రాజీవ్‌నగర్‌లోని వాసవీభవన్‌లో ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన హజరత్తయ్య గుప్తా మాట్లాడుతూ సమష్టి సేవలతో సమాజంలో వాసవీ క్లబ్‌ల కీర్తి ప్రతిష్టలు సమాజంలో అజరామరంగా ఉంటాయని చెప్పారు. ఈ నెల 29వ తేదీన జరిగే జిల్లా కాన్ఫరెన్స్‌ను విజయవంతం చేయాలని కోరారు. ఆహ్వాన పత్రికలు ఆవిష్కరించారు. కార్యక్రమంలో మామిడి శ్రీనివాసరావు, తాత రజనీకుమారి, ఆలపాటి ప్రభాకరరావు, కొత్త గణేష్‌బాబు, పలువురు జిల్లా నాయకులు పాల్గొన్నారు. అనంతరం వేముల హజరత్తయ్య గుప్తాను సన్మానించారు.

పాడి రైతులకు అండగా..

- పశు వైద్యానికి లేదు ఇక చింత
- 75శాతం రాయితీతో పశువుల దాణా పంపిణీ
- అవసరమైన మేరకు ప్రత్యేక యాప్‌లో నమోదు



కంచికచర్ల మండలం గండేపల్లిలో పశువుకు పరీక్షలు చేస్తున్న డాక్టర్ నవీన్‌కుమార్

కంచికచర్ల: పాడి రైతులకు అండగా రాష్ట్రంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఉంది. వ్యవసాయంతో పాటు పాడి పశువులతో చిన్న, సన్నకారు రైతులు మరింత ఆదాయాన్ని పెంచడానికి చర్యలు తీసుకుంది. పెరిగిన దాణా ధరలు, కూలీల కొరత, పశువుల ధరలతో గ్రామీణ ప్రాంతాల్లో సైతం పాల దిగుబడి తగ్గిపోవటంతో చాలా మంది ప్యాకెట్ల పాలపై ఆధారపడుతున్నారు. గత ప్రభుత్వంలో ఏదైనా పశువుకు సుస్తీ చేసి పశువైద్యశాలకు తోలుకెళ్లితే అక్కడ అవసరమైన మందులు లేక పాడి రైతులు అనేక ఇబ్బందులు పడేవారు. దీంతో పాడి రైతులు ప్రయివేట్ వైద్యుడు వద్దే పశువులకు వైద్యం చేయించుకునేందుకు ఇష్టపడేవారు. గత ప్రభుత్వ కాలంలో రాష్ట్ర వ్యాప్తంగా ఒకే రకమైన మందులు సరఫరా చేయడంతో అవి కొన్ని ప్రాంతాల్లో నిరుపయోగంగా మారేవి. ఈ విధానంతో రైతులపై ఆర్థికభారం పడేది. దీన్ని అధిగమించడానికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అవసరమైన చర్యలు తీసుకుంది.

వెబ్‌సైట్‌లో మందుల జాబితా

ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన విధానంలో మందుల ఎంపిక ఆయా పశువైద్యశాలల వైద్యులకు అప్పగించారు. ఆ ప్రాంతంలో పశువులకు సంక్రమించే వ్యాధులను బట్టి ఏ మందులు అవసరమో ఆసుపత్రి వైద్యులు నిర్ణయిస్తారు. అక్కడ వచ్చే వ్యాధులపై వారికి పూర్తి అవగాహన ఉండటంతో అవసరమైన మందులను కొనుగోలు చేస్తారు. దీంతో ప్రభుత్వ సొమ్ము దుర్వినియోగం కాకుండా ఉంటుందనేది ప్రభుత్వ భావన. మందుల ఎంపికలో పశువైద్యునితో పాటు వెటర్నరీ అసిస్టెంట్, ఇతర సహాయకులు చర్చించి నిర్ణయం తీసుకుంటారు. వారు ఎంపిక చేసిన మందుల జాబితాను ప్రభుత్వం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వెబ్‌సైట్‌లో ఉంచుతారు. ఆ జాబితాను రాష్ట్ర, జిల్లా స్థాయి ఉన్నతాధికారులు పరిశీలించి మందులను సరఫరా చేస్తారు.



75 శాతం రాయితీతో రైతులకు దాణా పంపిణీ చేస్తున్న పశువైద్యాధికారి

పాడి రైతుల సంక్షేమమే లక్ష్యం

వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పాడి రైతుల సంక్షేమానికి చర్యలు తీసుకుంది. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో పశు సంవర్ధకశాఖ నూతన పద్ధతులకు శ్రీకారం చుట్టింది. దీనిలో భాగంగా ఏ ప్రాంతంలో పశు వైద్యశాలకు సంబంధించి ఆ వైద్యుడే మందులు ఇండెంట్‌ను తయారు చేసి ప్రభుత్వానికి పంపుతాడు. 75శాతం సబ్సిడీతో పాడి రైతులకు పశువుల దాణా ప్రభుత్వం పంపిణీ చేస్తుంది. నందిగామ నియోజకవర్గంలో కంచికచర్ల, నందిగామ, వీరులపాడు, చందర్లపాడు మండలాల్లో గేదెలు 35వేలు, ఆవులు 5వేలు, గొర్రెలు 50వేలు, మేకలు 30వేలు వీటితో పాటు పెంపుడు కోళ్లు లక్ష, పెంపుడు కుక్కలు 250 వరకు ఉన్నాయని పశు సంవర్ధకశాఖ అధికారులు తెలిపారు. పశువైద్యశాలలు లైక్ స్టాక్ పాయింట్ల ద్వారా వైద్య సేవలు అందుతున్నాయి. ఇప్పటివరకు పశువులకు మందులు జిల్లా స్థాయి కమిటీ ప్రకారంగా పంపిణీ చేసేవారు. కొన్ని చోట్ల స్థానిక వాతావరణ పరిస్థితుల్లో పశువుల వ్యాధులకు సంబంధించిన మందులు లేక పోవటంతో పశు యజమానులు బయట దుకాణాల్లో మందులు కొనుగోలు చేయాల్సి వచ్చేది.

నూతన విధానంతో పశుపోషకులకు మేలు

ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన విధానంతో పాడి రైతులకు మేలు జరుగుతుంది. గతంలో పశువులకు అనారోగ్యం ఏర్పడితే బయట మందులు రాసేవాళ్లం. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. స్థానిక పరిస్థితుల ఆధారంగా మందుల ఎంపిక ఉంటుంది. మందుల ఎంపిక జాబితాను ఇప్పటికే ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఎంఎంఎస్ యాప్‌లో అప్‌లోడ్ చేశారు.

–కె.వెంకట్రావు, పశు సంవర్ధకశాఖ సహాయ సంచాలకుడు, కంచికచర్ల

విజ్ఞానకేంద్రం భవనానికి శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న దృశ్యం

వత్సవాయి: మండల కేంద్రం వత్సవాయిలో బొగ్గవరపు వెంకటేశ్వరరావు విజ్ఞానకేంద్రం భవనానికి ఆదివారం శంకుస్థాపన చేశారు. గ్రామస్తులు పులిపాటి చంద్రశేఖర్, పుష్పావతి దంపతులు భవన నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని ఉచితంగా అందజేశారు. విజయవాడకు చెందిన మాకినేని బసవపున్నయ్య విజ్ఞానకేంద్రానికి చెందిన బాధ్యులు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా నేత డీవీ కృష్ణ మాట్లాడుతూ సమాజసేవ చేసేవారు గ్రామాల్లో కూడా నేడు కనుమరుగవుతున్నారన్నారు. విజ్ఞానకేంద్రం భవన నిర్మాణానికి స్థలాన్ని ఇచ్చిన దాతలను వారు సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచ్ భూక్యా సీతమ్మ, ఎంపీపీ కొలుసు రమాదేవి, ఆర్యవైశ్య సంఘ అధ్యక్షులు బొగ్గవరపు రాజారావు, హనుమంతురావు, సీపీఎం నేతలు చిరుమామిళ్ల హనుమంతురావు, మండేపుడి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలి



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న పోలీసులు

నందిగామ: రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలని ఇన్‌స్పెక్టర్ హనీష్ హెచ్చరించారు. పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లకు ఆదివారం కౌన్సెలింగ్ నిర్వహించారు. ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ రౌడీషీటర్లు అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే ఉపేక్షించబోమని హెచ్చరించారు. ప్రతి రౌడీషీటర్‌పై ప్రత్యేక నిఘా ఉందన్నారు. కార్యక్రమంలో ఎస్సై పండు దొర, సిబ్బంది పాల్గొన్నారు.

వీరులపాడు: నేర చరిత కలిగిన వారు ప్రవర్తన మార్చుకోవాలని ఎస్‌ఐ మహాలక్ష్మణుడు పేర్కొన్నారు. మండలంలోని రౌడీ షీటర్‌లకు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఆదివారం ఆయన అవగాహన కలిగించారు. ఆయన మాట్లాడుతూ నేరచరిత్ర కలిగిన వారిపై ప్రత్యేక నిఘా ఉంచామన్నారు. సత్ప్రవర్తనతో నడుచుకునే వారిపై రౌడీషీట్ తొలగించేలా ఉన్నతాధికారులకు సిఫారసు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

కరాటేలో 19 మంది విద్యార్థులకు బెల్ట్ ప్రమోషన్లు



బెల్ట్ ప్రమోషన్ పొందిన విద్యార్థులతో శ్రీనివాసులు, హర్ష తదితరులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): జేకే గోజురియో కరాటే అకాడమీ సత్యనారాయణపురం, రామకృష్ణాపురం బ్రాంచిలకు చెందిన విద్యార్థులకు విద్యాధరపురంలోని ఓ కల్యాణ మండపంలో ఆదివారం బెల్ట్ ప్రమోషన్స్ పరీక్షలు నిర్వహించారు. ఇందులో మొత్తం 19 మంది విద్యార్థులు ఎల్లో బెల్ట్ నుంచి బ్లాక్ బెల్ట్ వరకు ప్రమోట్ అయ్యారు. ఈ సందర్భంగా అకాడమీ వ్యవస్థాపకుడు జె.శ్రీనివాసులు వారికి సర్టిఫికెట్స్ అందజేశారు. అనంతరం ఆయన ప్రమోట్ అయిన విద్యార్థులను అభినందిస్తూ కరాటే విద్య అనేది విద్యార్థులకు శారీరక దారుఢ్యంతోపాటు ఆత్మరక్షణకు ఎంతగానో దోహదపడుతుందన్నారు. సాధారణ చదువుకు ఎటువంటి ఆటంకం లేకుండా ఖాళీ సమయాల్లోనే కరాటే విద్యను నేర్చుకోవచ్చని చెప్పారు. వివిధ రకాల బెల్ట్‌లు పొందిన విద్యార్థులు మరింత శిక్షణ తీసుకుని వారి లక్ష్యానికి చేరుకోవాలన్నారు. అదే విధంగా జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో పాల్గొని దేశానికి, రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. విద్యార్థులను అభినందించినవారిలో అకాడమీ సెక్రటరీ జే హరనాథ్, సత్యనారాయణపురం బ్రాంచి కోచ్ పీవీకేఎస్ హర్ష, మహేష్, సాయికుమార్, నరసింహ, మధు, నవీన్ ఉన్నారు.

హిందూ ధర్మ పరిరక్షణకు కృషి చేయాలి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న స్వామీజీలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): హిందూ ధర్మ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఏపీ సాధు పరిషత్ అధ్యక్షుడు శ్రీనివాసా నంద సరస్వతి తెలిపారు. అయోధ్యనగర్ క్షత్రియ భవనంలో ఆదివారం హిందూ ధార్మిక పరిషత్ వ్యవస్థాపకులు బుద్ధరాజు శివాజీ రాజా ఆధ్వర్యాన నిర్వహించిన విలేకర్ల విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

ప్రభుత్వాలు హిందూ దేవాలయాలు, ఆస్తుల పరిరక్షణకు కృషి చేయాలని కోరారు. ప్రతి ఒక్కరూ బాగుండాలన్నదే హిందూ మతం సారాంశం అన్నారు. శివస్వామి మాట్లాడుతూ హిందూ ధర్మ పరిరక్షణకు పనిచేసే వారికే దేవాలయాల ట్రస్ట్ బోర్డులలో అవకాశం ఇవ్వాలని కోరారు. ఈ సందర్భంగా హిందువులు సంఘటితంగా ఉండి హిందూ ధర్మ పరిరక్షణకు కృషి చేయాలని తీర్మానం చేశారు. హిందూ సంఘాలు ఐక్య వేదిక అధ్యక్షుడు లలిత్ కుమార్, రాష్ట్రీయ దళిత సేన అధ్యక్షుడు హమార ప్రసాద్, హిందూ సంఘాల నాయకులు రమణ కాసారపు, కళ్యాణ్ కుమార్ చెట్లపల్లి, వీవీఆర్ కృష్ణంరాజు, శ్రీనివాస్ యాదవ్, ఫణీంద్ర, పీవీ సతీష్, వరప్రసాద్ పలువురు పీఠాధిపతులు, స్వామీజీలు, విశ్రాంత ఉన్నతాధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఠాగూర్ గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): బందరు రోడ్డులోని ఠాగూర్ స్మారక గ్రంథాలయంలో ఆదివారం చదవడం మాకిష్టం కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా పుస్తక ప్రదర్శన, నృత్యం, సంగీతం, భగవద్గీత శ్లోకాలపై విద్యార్థులకు శిక్షణనిచ్చారు. గ్రంథాలయాధికారి కె. రమాదేవి మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు పౌర గ్రంథాలయ శాఖ ఉత్తర్వుల ప్రకారం ప్రతి నెలా మొదటి ఆదివారం పుస్తక ప్రదర్శన నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రదర్శనలో విజ్ఞానం, ఆధ్యాత్మికం, జాతీయ నాయకుల చరిత్రలు, శాస్త్రజ్ఞుల జీవిత చరిత్రలు, కథలు, కవితలు ఉన్నాయన్నారు.

నేడు కంచికచర్ల సచివాలయం-3 పరిధిలో 'సురక్ష'

కంచికచర్ల: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం స్థానిక గ్రామ సచివాలయం-3 పరిధిలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం ఉదయం జరుగుతుందని ఎంపీడీఓ కె.బాలశంకరరావు ఆదివారం తెలిపారు. రోగులకు అవసరమైన కంటి పరీక్షలు, మలేరియా పరీక్షలు, బీపీ, షుగర్, రక్త పరీక్షలు ఆరోగ్య సిబ్బంది అందజేస్తారన్నారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషక విలువలతో కూడిన స్టాళ్లను ఏర్పాటు చేస్తారని తెలిపారు.

గౌరవరం(జగ్గయ్యపేట): గ్రామంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో సోమవారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ రమేష్ బాబు ఆదివారం తెలిపారు. ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు శిబిరం జరుగుతుందని పేర్కొన్నారు.

నేడు లింగగూడెంలో

లింగగూడెం(పెనుగంచిప్రోలు): లింగగూడెం గ్రామంలో సోమవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ ఎస్వీ ప్రసాద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

సందేశాత్మకంగా సాగిన నాటక ప్రదర్శన



భూగోళం నాటకంలోని ఓ సన్నివేశం

విజయవాడకల్చరల్: ఆంధ్రా ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో నెల వారీ కార్యక్రమంలో భాగంగా గాంధీనగర్ వెలిదండ్ల హనుమంతరాయ గ్రంథాలయంలో ఆదివారం ప్రదర్శించిన భూగోళం నాటకం సందేశాత్మకంగా సాగింది. నేటి ఆధునిక సమావేశంలో మానవ సంబంధాలు మాయం అవుతున్నాయని ఆర్థిక సంబంధాలు కుటుంబ వ్యవస్థను పట్టించుకోవడం లేని మానవ సంబంధాలు కాపాడుకోవాలనే సందేశంతో నాటిక సాగుతుంది. రచన మెదలి సంజీవి, దర్శకత్వం వేంపాటి రమేష్, బాయన శ్రీనివాసరావు, వేంపాటి రమేష్, బొర్రా నారాయణ, రాధ, రాజేశ్వరి నటించారు. కార్యక్రమాలను ప్రారంభించిన గ్రంథాలయం అధ్యక్షుడు డోకిపర్తి శంకరరావు మాట్లాడుతూ.. గ్రంథాలను రూ.25 లక్షలతో ఆధునీకరించినట్లు తెలిపారు.

ముస్లిం మైనార్టీలకు సముచిత స్థానం



అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): ముస్లిం మైనార్టీల సంక్షేమానికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధిక ప్రాధాన్యం వస్తుందని పార్టీ నగర ప్రధాన కార్యదర్శి బెజ్జం రవికుమార్ తెలిపారు. సింగ్‌నగర్‌లోని ఆజాద్ ముస్లిం కమిటీ రాష్ట్ర కార్యాలయం వద్ద షేక్ చిన్నభాష అనే దివ్యాంగుడికి ఆదివారం ట్రై సైకిల్ పంపిణీ చేశారు. రవికుమార్ మాట్లాడుతూ ముస్లిం మైనార్టీలకు అన్ని రంగాల్లో సముచిత స్థానం కల్పించిన ఘనత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. ముస్లిం మైనార్టీ ప్రజల హక్కుల సాధన కోసం ఆజాద్ ముస్లిం కమిటీ చేపడుతున్న కార్యక్రమాలు ఆదర్శనీయమని చెప్పారు. ఏఎంసీ రాష్ట్ర అధ్యక్షుడు షేక్ నాగుల్‌మీరా మాట్లాడుతూ తమ కమిటీ ఆధ్వర్యంలో కేవలం ముస్లిం మైనార్టీ ప్రజల సమస్యల పరిష్కారం కోసం పోరాడడమే కాకుండా నిరుపేద ప్రజలను ఆదుకునేందుకు అనేక సేవా కార్యక్రమాలను చేపడుతున్నామని తెలిపారు. ఆజాద్ ముస్లిం కమిటీ నాయకులు షేక్ సాజిద్ అలీ, ఎండీ కాలేషా, సయ్యద్ మౌలాలి, షేక్ కలందర్, మస్తాన్ షరీఫ్, షేక్ ఆదం షరీఫ్ పాల్గొన్నారు.

జీవనోపాధి పెంపునకు తోడ్పాటు



కరపత్రాలతో డీడీ సాంబయ్య, సర్పంచ్ పద్మకుమారి, తదితరులు

పెనుగంచిప్రోలు: మహిళలు జీవనోపాధి పెంచుకోవడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తోడ్పాటు కార్యక్రమాలు అమలు చేస్తున్నాయని జిల్లా పరిశ్రమల సెంటర్ డెప్యూటీ డైరెక్టర్ బి.సాంబయ్య అన్నారు. స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఆదివారం ఆపరేషన్ బ్లాక్ మండలం కింద సంకల్ప్ సప్తాహ్ కార్యక్రమంలో సమృద్ధి దీవాస్-జీవనోపాధులపై అవగాహన సదస్సు సర్పంచ్ వేల్పుల పద్మకుమారి అధ్యక్షతన నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు ప్రభుత్వం అందిస్తున్న వివిధ పథకాలను వినియోగించుకుని ఆర్థికంగా మరింత బలపడాలన్నారు. డ్వాక్రా సంఘాల్లోని మహిళలకు ప్రభుత్వం ఎన్నో రకాల పథకాలు అమలు చేస్తోందన్నారు. పీఎంజీపీ పథకంలో భాగంగా గ్రామీణ ప్రాంతాల్లో పరిశ్రమలు స్థాపించుకునే ఎస్సీ, ఎస్టీ మహిళలకు 35 శాతం, ఇతరులకు 25 శాతం సబ్సిడీ ఇస్తారని తెలిపారు. అర్బన్ ప్రాంతాల్లో ఎస్సీ, ఎస్టీ మహిళలకు 25 శాతం, ఇతరులకు 15 శాతం సబ్సిడీ ఇస్తారన్నారు. వైఎస్సార్ బడుగు వికాసంలో భాగంగా పరిశ్రమలు స్థాపించుకునే వారికి ఎస్సీ, ఎస్టీ వారికి 45 శాతం, ఇతరులకు 20 శాతం వరకు సబ్సిడీ ఉంటుందని తెలిపారు. పీఎం విశ్వకర్మ పథకానికి సంబంధించి 18 రకాల కులవృత్తుల వారికి రుణాలు ఇస్తారని పేర్కొన్నారు. దీనిలో పేరు రిజిస్టర్ చేసుకుంటే ఐడీ కార్డు ఇస్తారన్నారు. ముందుగా రూ.లక్ష రుణం ఇస్తే వడ్డీ 5శాతం ఉంటుందని, సక్రమంగా 18 నెలల లోపు తిరిగి చెల్లిస్తే రూ.2 లక్షల వరకు రుణం ఇస్తారన్నారు. సదస్సులో భాగంగా ఇండస్ట్రియల్ ప్రొడక్ట్ ఎగ్జిబిషన్ నిర్వహించారు. సర్పంచ్ పద్మకుమారి మాట్లాడుతూ ప్రభుత్వం మహిళలు, పేదల కోసం అమలు చేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకుని జీవనోపాధిని మెరుగు పరుచుకోవాలన్నారు. కార్యక్రమంలో పరిశ్రమల ప్రమోషన్ అధికారి వేణు, మండల సమాఖ్య అధ్యక్షురాలు కాకాని పద్మ, ఏఓ సిద్ధారెడ్డి, ఏపీఎం రాజారావు, గ్రామ కార్యదర్శి శ్యామ్, మహిళలు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి కృషి



పాలకవర్గ సభ్యుల సన్మానంలో ఆలయ ఈఓ రమేష్‌నాయుడు, చైర్మన్ చెన్నకేశవరావు

పెనుగంచిప్రోలు: స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వవిప్ సామినేని ఉదయభాను సహకారంతో ఆలయ అభివృద్ధిలో భాగస్వాములయ్యామని చైర్మన్ ఇంజం చెన్నకేశవరావు అన్నారు. గ్రామంలోని శ్రీతిరుపతమ్మ ఆలయ పాలకవర్గ పదవీ కాలం ఈనెల 10వ తేదీతో ముగియనుంది. ఆదివారం ఆలయ మండపంలో వీడ్కోలు సభ నిర్వహించారు. చైర్మన్ మాట్లాడుతూ ఆలయ అధికారులు, పాలకవర్గ సమన్వయం, సహకారంతో రెండేళ్ల పదవీకాలంలో ఆలయ అభివృద్ధికి ఎంతో కృషి చేశామన్నారు. ఆలయ ఆదాయం పెరగటంతో పాటు ఎమ్మెల్యే కృషితో రూ.15 కోట్ల అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టామన్నారు. ఉద్యోగుల జీతాల పెంపు కూడా తమ హయాంలో జరిగిందన్నారు. అనంతరం ఆలయ చైర్మన్, ఈఓ కె రమేష్‌నాయుడు ఆధ్వర్యంలో పాలకవర్గ సభ్యులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఈఈ వైకుంఠరావు, ఏఈఓలు ఉమాపతి, తిరుమలేశ్వరరావు, ఏఈ రాజు, సిబ్బంది, పాలకవర్గ సభ్యులు కోలా రామారావు, మురిమురి పద్మ, కట్టా మాధవి, కురువెళ్ల రాయప్ప, ఆదిమూలం నరసింహారావు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాల వద్ద పారిశుద్ధ్య పనులు పూర్తి



శుభ్రం చేసిన గురుకుల పాఠశాల ఆవరణ

జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలోని బలుసుపాడు రోడ్డులోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల ఆవరణలో చేపట్టిన పారిశుద్ధ్య పనులు ఆదివారం పూర్తయ్యాయి. గురుకుల పాఠశాల ఆవరణ లో కంపచెట్లు, పిచ్చిమొక్కలు పెరిగిపోయి అధ్వానంగా ఉంది. విషయం తెలుసుకున్న ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను చొరవ తీసుకుని జేసీబీని పంపించి నాలుగు రోజులపాటు కంపచెట్లు, పిచ్చిమొక్కలు తొలగించే కార్యక్రమం చేపట్టారు. ఆవరణను శుభ్రం చేయించారు. ప్రిన్సిపాల్ కె.లక్ష్మీ సుజాత, ఉపాధ్యాయ బృందం, సిబ్బంది ఎమ్మెల్యే ఉదయభానుకు కృతజ్ఞతలు తెలియజేశారు.

రక్తదాత యర్రమాసుకు సత్కారం



73సార్లు రక్తదానం చేసిన రామకృష్ణను సన్మానిస్తున్న లయన్స్

జగ్గయ్యపేట అర్బన్: స్వచ్ఛందంగా ముందుకు వచ్చి 73 సార్లు రక్తదానం చేసిన రక్తదాత వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా నియోజకవర్గ కో కన్వీనర్ యర్రమాసు రామకృష్ణను లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సన్మానించారు. ఆదివారం స్థానిక లయన్స్ కమ్యూనిటీ హాల్‌లో జరిగిన కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఆఫ్ జగ్గయ్యపేట ఆధ్వర్యాన రక్తదాత యర్రమాసును ఘనంగా సన్మానించారు. లయన్స్ క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ రాజాకేశవప్రసాద్ మాట్లాడుతూ సేవా దృక్పథంతో ప్రతి ఒక్కరూ రక్తదానం చేయడానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. మరొక రక్తదాత నేలవెల్లి రమేష్‌ను సన్మానించారు. లయన్స్ క్లబ్ కార్యదర్శి పి.కృష్ణమూర్తి, కోశాధికారి కరుణాకరరావు, జిల్లా ఉప కోశాధికారి షేక్ ఖాసిం సైదా, రీజియన్ చైర్మన్ కె.మోహన్‌బాబు, జోన్ చైర్మన్ నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సాహిత్యానికి సామాజిక ప్రయోజనం ఉండాలి

అరసం జాతీయ అధ్యక్షుడు పెనుగొండ లక్ష్మీనారాయణ



ఆవిష్కరణ సభలో లక్ష్మీ నారాయణ, డాక్టర్ ప్రభాకర్, కలిమిశ్రీ, విల్సన్‌రావు, డాక్టర్ జీవీ పూర్ణచందు

విజయవాడ కల్చరల్: సాహిత్యానికి సామాజిక ప్రయోజనం ఉండాలని అభ్యుదయ రచయితల సంఘం జాతీయ అధ్యక్షుడు పెనుగొండ లక్ష్మీనారాయణ అన్నారు. మల్లెతీగ సాహిత్యసేవా సంస్థ ఆధ్వర్యంలో కలమిశ్రీ సంకలనపరచిన ప్రేరణ వ్యాస సంకలనం ఆవిష్కరణసభ బందరురోడ్డులోని ఠాగూర్ గ్రంథాలయంలో ఆదివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న లక్ష్మీనారాయణ మాట్లాడుతూ సమాజాన్ని ప్రేరణ కలిగించేది మంచి సాహిత్యం అవుతుందని తెలిపారు. కవిగా విల్సన్‌రావు సమాజాన్ని అధ్యయనం చేశారన్నారు. సాహితీవేత్త డాక్టర్ ప్రభాకరరావు మాట్లాడుతూ కవి విల్సన్‌రావు దేవుడు తప్పిపోయాడు కవితా సంకలనం రచించారని తెలిపారు. కవితా సంపుటిమీద పలువురు రచయితలు సమీక్ష చేశారని అదే వారికి ప్రేరణ కలిగించి వ్యాస సంకలన మైందన్నారు. ప్రపంచ తెలుగు రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి డాక్టర్ పూర్ణచందు ప్రేరణ గ్రంథం విశేషాలను వివరించారు. పరిశోధకుడు జి.లక్ష్మీనరసయ్య గ్రంథాన్ని ఆవిష్కరించారు. సీనియర్ జర్నలిస్ట్ అన్నవరపు బ్రహ్మయ్య, విప్లవ రచయితల సంఘం సంఘం అధ్యక్షుడు అరసవిల్లి కృష్ణ ప్రసంగించారు. కవి విల్సన్‌రావు తనకు ప్రేరణ కలిగించిన అంశాలను వివరించారు. వ్యాస రచయితలను నిర్వాహకులు ఆత్మీయంగా సత్కరించారు.

172 మందికి ఉచిత వైద్య పరీక్షలు

పాయకాపురం(విజయవాడరూరల్): స్వచ్ఛంద సేవా సంస్థలు ఉచిత వైద్య శిబిరాల ద్వారా అందిస్తున్న సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే మల్లాది విష్ణు తెలిపారు. 62వ డివిజన్ పుచ్చలపల్లి సుందరయ్య ఎలిమెంటరీ స్కూల్లో సంధ్య కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత నేత్ర వైద్య పరీక్ష శిబిరం నిర్వహించారు. ఎమ్మెల్యే మల్లాది విష్ణు మాట్లాడుతూ డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ, ఈహెచ్ఎస్ పథకాల కింద ఆపరేషన్లు ఉచితంగా చేస్తామని పేర్కొన్నారు. వాటిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పార్టీ నాయకులు అలంపూరు విజయ్,రామిరెడ్డి, బుజ్జి, మహేష్, హైమావతి, ఆసుపత్రి డాక్టర్లు పాల్గొన్నారు. 172 మందికి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించారు.